
హైదరాబాద్ వార్త

అయోధ్య ఆలయంలో రామలల్లా విగ్రహం 'ప్రాణప్రతిష్ట' సందర్భంగా హైదరాబాద్ నగరంలోని రామాలయాలతో పాటు హనుమాన్ దేవాలయాలన్నీ సర్వాంగసుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. సోమవారం జరిగే అద్భుత ఘట్టానికి గడియలు సమీపిస్తుండడంతో నగరంలోని ఆలయాలన్నీ రామనామంతో మారుమ్రోగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో వివిధ రకాల ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఆలయాలను శుద్ధి చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. వేడుకలకు గుర్తుగా ఉత్సవాల సన్నాహాలతో నగరం కళకళలాడుతోంది.

- నేడు అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం
- సర్వాంగసుందరంగా రూపుదిద్దుకుంటున్న నగర దేవాలయాలు
- ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సంస్థలు
- అన్నదానాలు, రామభజనలు
- ఆధ్యాత్మిక వాతావరణంలో హైదరాబాద్ నగరం

శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ నుంచి ప్రతినిధి బృందాలు ఆలయం ప్రతిష్ట పూజ కోసం తెచ్చిన 'అక్షింతలు' భక్తులకు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30వేల దేవాలయాలు సంబంధిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ, నగరం అంతటా బహిరంగ మైదానాలు అయోధ్య రామ మందిరాన్ని పోలిఉండే నిర్మాణాలతో రూపాంతరం చెందాయి.



# బాల రాముడి నగర వైభోగం






ప్రతి ఇంటి ముందు ఐదు దీపాలు వెలిగించి 'రామజోనయతి'తో కుటుంబాలు పాల్గొనాలని చేసిన విజ్ఞప్తిని ప్రజలు అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఆలయ స్థాపనకు దారితీసిన 500 ఏళ్ళ పోరాటానికి నివాళిగా ఐదుదీపాల వెనుక ప్రతీక. కొన్ని స్వచ్ఛంద సంస్థలు అయోధ్యలో జరిగే ఆ మహాఘట్టాన్ని ప్రజలందరు ప్రత్యక్షప్రసారం ద్వారా చూసే విధంగా భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లను అందుబాటులోకి తీసుకురానున్నారు.

2లో

## జ్వరం వచ్చినా.. ఇంటికి పంపరు!



### 'కార్పొరేట్' ఒత్తిడి

- పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిందే
- నిబంధనలు గాలికొదిలిన కార్పొరేట్ విద్యాసంస్థలు
- ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులపై ఒత్తిళ్లు
- ర్యాంకుల కోసం.. రాత్రింబవళ్లు తరగతులు నిర్వహణ
- మానసిక ఒత్తిడికి గురవుతున్న ఇంటర్ విద్యార్థులు

హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త: విద్యార్థులంటే తమ కళాశాలలకు ర్యాంకులు తెచ్చే సాధనాలుగా చూస్తున్నారు. ఇటీవల నగరంలోని కొన్ని కార్పొరేటర్ జూనియర్ కళాశాలలు విద్యా ర్థులకు విరామం లేకుండా రాత్రి బవళ్లు పుస్తకాలతోనే కుస్తీ పట్టి స్తున్నారు. ఆటలకు కనీసం ఒక్క గంటకూడా కేటాయించడం లేదు. ఆటలు, డ్రాయింగ్, నృత్యం, గ్రంధాలయం వంటివి కాగితాల్లోనే చూపిస్తున్నారు. చాలా కాలేజీల్లో విద్యార్థులు నిత్యం పుస్తకాలతోనే గడుపుతున్నారు. పాఠ్యాంశాలు పూర్తికావటం లేదని, విద్యార్థులు వెనకబడిపోతున్నారని అందకే సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నామని తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యాలు తెలుపుతున్నాయి. మంచి ర్యాంకులు రావాలంటే విద్యార్థులపై కొంత ఒత్తిడి తప్పదని పేర్కొంటున్నారు. దీంతో తీవ్ర ఒత్తిళ్లకు గురై ఏదోఒక ప్రాంతంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు ఉన్నాయి. గతేడాది ఓవిద్యార్థి తమ కళాశాల తరగతులు నిర్వహిస్తుందంటూ ఓవిద్యాసంస్థకు చెందిన విద్యార్థులు చేతిని గాయపరచుకున్నారు. ఇలాంటి సంఘటనలు అక్కడక్కడ జరుగుతున్న కార్పొరేట్ విద్యాసంస్థల్లో మార్పురావడం లేదని విద్యారంగ నిపుణులు అంటున్నారు.

**పరీక్షలు ముగిసే వరకు సెలవుల్లేవు..** పరీక్షలు పూర్తయ్యే వరకు ఒక్కరోజు కూడా సెలవులేదంటూ విద్యార్థులను విద్యాసంస్థల్లోనే ఉంచుతున్నారు. కనీసం వారాంతపు సెలవులను విద్యార్థులకు ఇవ్వడం లేదు. ప్రత్యేక తరగతుల పేరుతో నిరంతరం తరగతులు నిర్వహిస్తుండటంతో జైల్లో ఉన్నట్లుగా ఉందని పలువురు విద్యార్థులు తెలుపుతున్నారు. జ్వరం వచ్చినా తరగతులకు హాజరవుతున్నామని తెలుపుతున్నారు. దీంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న పలువురు విద్యార్థులు ఎవరికీ చెప్పకుండా అక్కడి నుండి బయటకికి వచ్చేస్తున్నారు. రోజుకు ఎన్నిగంటలు తరగతులు జరగాలి.. ఎంతసేపు విరామం ఇవ్వాలి.. తదితర నిబంధనలను గ్రేటర్ పరిధిలోని చాలా కార్పొరేట్ విద్యాసంస్థలు పట్టించుకోవట్లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. విద్యార్థులు ఇష్టంతో ప్రమేయం లేకుండా.. ఇష్టారాజ్యంగా తరగతులు నిర్వహిస్తున్నారని పలువురు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. గతేడాది ఇదే సమయంలో వనస్థలిపురం, కూకట్‌పల్లి ప్రాంతాల్లో ఒత్తిడికి లోనై ఆత్మహత్య సంఘటనలు అందరికీ తెలిసిందే. దీంతో పలువురు తల్లిదండ్రులు కూడా తరగతులు నిర్వహణ విషయంలో ఆందోళన చెందుతున్నారు.

> ఎల్‌కేజీ నుంచే ఐఐటీ వరకు స్పెషల్ టీచింగ్ ఇస్తూ.. దేశంలోనే గొప్ప పేరును సంపాదించుకున్న మన కార్పొరేట్ కాలేజీలు అందుకు తగ్గట్టుగా విద్యార్థులను పీల్చి పిప్పి చేస్తున్నారు. ఏడాది పొడవునా..చదువులు పరీక్షలంటూ రకరకాల ప్రయోగాలు చేస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తున్నారు.మరో నెలరోజుల్లో ఇంటర్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక తరగతుల పేరుతో కొన్ని ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పెంచుతున్నాయి. పరీక్షలు పూర్తయ్యేవరకు ఒక్కరోజుకూడా సెలవులిచ్చేది లేదంటూ ఆదివారం కూడా తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఎవరికీ చెప్పుకోలేక.. అటూ చదవలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.



## అభయహస్తం దరఖాస్తుల కంప్యూటరీకరణ పూర్తి

హైదరాబాద్, జనవరి 21 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజులలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 50 రోజులు కావస్తుంది. ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి ప్రభుత్వం ప్రజల నుంచి దరఖాస్తులను కూడా స్వీకరించింది. ఒక రకంగా చెప్పాలంటే అభయహస్తం గ్యారంటీ లతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అధికార విపక్షాలు పేర్కొంటున్నాయి. ఇక అభయహస్తం అమలు జరపాల్సిన సమయం రానే వచ్చింది.

మిగతా సిటీ 3వ పేజీలో



మారేడ్‌పల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో అలుమిని వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశ్ గౌడ్

## విద్యావంతులు సమాజాభివృద్ధికి పాటుపడాలి : బుర్ర వెంకటేశ్ గౌడ్

అడ్డగుట్ట, జనవరి 21 ప్రభాతవార్త: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివిన విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెంది సమాజాభివృద్ధి కోసం పాటుపడాలని తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం సికింద్రాబాద్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన అలుమిని మీట్ 2024 వేడుకలు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివిన పూర్వ విద్యార్థులు వివిధరంగాలల్లో అభివృద్ధి చెంది దేశాభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. వారికి ఎల్లప్పుడు తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు.

మిగతా సిటీ 3వ పేజీలో



3లో

లవ్ మై ఇండీ డాగ్ షోలో పాల్గొన్న కుక్కలు

## వీధికుక్కలను దత్తత తీసుకుందాం

**బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ ఫౌండర్ అక్కినేని అమల**

వీధి కుక్కలను దత్తత తీసుకుందాం, వాటి నుండి రక్షణ పొందుదామని బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల పిలుపునిచ్చారు. ఆదివారం లోయర్‌ట్యాంక్ బండ్‌లోని చైతన్య విద్యాలయ పాఠశాలలో మార్స్ పెట్ కేర్‌తో కలసి లవ్ మై ఇండీ డాగ్ షో రెండో ఎడిషన్ నిర్వహించారు.









## ముగిసిన వింగ్స్ ఇండియా 2024 ప్రదర్శన


బేగంపేట విమానాశ్రయంలో ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన వింగ్స్ ఇండియా ఏవియేషన్ షో ఆదివారం ముగిసింది.ఈ ప్రదర్శనలో శని,ఆదివారాలు సాధారణ సందర్శకులను అనుమతించడంతో ఆదివారం విమానాశ్రయ ప్రాంగణానికి భారీ ఎత్తున సందర్శకులు తరలి వచ్చి భారీ విమానాలు,హెలికాప్టర్లు,చార్టెట్,చాపర్లు,డ్రోన్లను చూసి ఆనందించారు. విమానాశ్రయానికి చేరుకున్న సందర్శకులు ప్రదర్శనలో ఉంచిన బోయింగ్ 777తో పాటు వాణిజ్య అవసరాలకు వినియోగించే భారీ విమనాలను చూసి ఆనందం వ్యక్తం చేసారు.వీటితో పాటు సారంగ్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన హెలికాప్టర్ విన్యాసాలు,యూకేకి చెందిన మార్క్ జెఫ్రీ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన తేలిక పాటి విమానాల ఏరోబాటిక్ విన్యాసాలను చూసి కేరింతలు కొట్టారు. (ప్రభాతవార్త - బేగంపేట)

## రేటు తగ్గించి డ్రెస్ కుట్టలేదని టైలరింగ్ షాపునకు నిప్పు

హైదరాబాద్, జనవరి 21 ప్రభాతవార్త : తక్కువకు డ్రెస్ కుట్టలేదని టైలర్ షాపు కాల్చేసిన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుం ది. ఫిలింనగర్‌లోని లక్ష్మీనగర్‌లో ఖదీర్ అనే వ్యక్తి టైలర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే.. రోజూ లాగానే కొందరు బట్టలు కుట్టించుకునేందకు వస్తుంటారు. అలాగే మసూద్ అనే వ్యక్తి కూడా వచ్చాడు. తనకు బట్టలు కుట్టాలని కోరారు. అయితే ఖదీర్ దానికి సరే అన్నారు. ఇద్దరి మధ్య బట్టలు కుట్టడానికి డబ్బుల వ్యవహారంలో కాస్త అటు ఇటు అయ్యింది. ఖదీర్ రూ.1200లు అవుతుందని తెలిపారు. దానికి మసూద్ అంతలేదు

మిగతా సిటీ 3వ పేజీలో

## మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికలలో బిఆర్ఎస్ విజయం ఖాయం : లక్ష్మారెడ్డి



మల్కాజిగిరి పార్లమెంట్ సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ఉప్పల్, జనవరి 21 ప్రభాతవార్త :** మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగిన మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పలువురు పార్టీ నేతలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నగరంలోని అన్ని స్థానాల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించిందని, వచ్చే ఎన్నికల్లో కూడా బిఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు చర్యలు తీసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోకవర్గం పరిధిలోని పలువురు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



అయోధ్య శ్రీరామ మందిరంలో నేడు నిర్వహించబోయే బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా వనస్థలిపురంలో శ్రీరాముడి భారీ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న విహెచ్‌పి నాయకులు (వనస్థలిపురం, ప్రభాతవార్త)

## హబ్సిగూడలో కేబుల్ పనుల పరిశీలన : చేతన



జెఎస్ఎన్ కాలనీలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ చేతన తదితరులు

**ఉప్పల్, జనవరి 21 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ జెఎస్ఎన్ కాలనీలో ఐసిఎస్ఇ నూతన భవనం ఎలక్ట్రికల్ కేబుల్ పనులను స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జెఎస్ఎన్ ఈస్ట్ కాలనీలో ఐసిఎస్ ఇ నూతన భవనం కేబుల్ పనులు చేపడుతున్నారని, ఎలక్ట్రికల్ కేబుల్, కాంక్రీట్ కేబుల్ కింది కవరింగ్ పనులు ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఇదే ప్రాంతంలో 11 కెవి కేబుల్ ఉండడం వల్ల ప్రజలకు అంతరాయం లేకుండా చేపట్టాలని సూచించారు. త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎఇ అసిఫ్‌అలీ, మున్సిపల్ ఎఇ సాయికిరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రాథోడ్, బిజెపి నేత సంజయ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు హబ్సిగూడ స్ట్రీట్‌నెం.8లో ఉప్పల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం

**ఉప్పల్, జనవరి 21 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని హబ్సిగూడ స్ట్రీట్‌నెం.8లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు వేద పండితులతో పూజల అనంతరం క్యాంపు కార్యాలయం ప్రారంభిస్తారని తెలిపారు. నియోజకవర్గం ప్రజలు తమ సమస్యలను విన్నవించేందుకు క్యాంపు కార్యాలయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజల కోసం ప్రత్యేకంగా క్యాంపు కార్యాలయంలో సేవా కేంద్రం అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఘనంగా ప్రారంభమైన దిల్‌సుక్‌నగర్ షటిల్ ప్లేయర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్




షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న చేతన్‌ఆనంద్, సామ ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, కరెడ్ల శ్రీనివాసరావు తదితరులు

**మలక్‌పేట,జనవరి 21 ప్రభాతవార్త:** దిల్‌సుక్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ సౌజన్యంతో 19వ ఇన్విటేషనల్ రిపబ్లిక్ డే షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ -2024 అసోసియేషన్ ఛైర్మన్ సామ ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. షటిల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అర్జున అవార్డు గ్రహీతలు చేతన్‌ఆనంద్, ఎన్.సిక్కిరెడ్డి, హైదరాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు శారదగోవర్ధని, అంతర్జాతీయ క్రీడాకారుడు సుమిత్, డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు విచ్చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో చక్కటి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. షటిల్ బాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరావులు మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షటిల్ టోర్నమెంట్ ఈ నెల 25వ తేదీవరకు కొనసాగుతాయని వివరించారు. 19, 35, 50 యేళ్ల పురుషుల డబుల్స్‌లో పోటీలను నిర్వహిస్తున్నామని తెలియజేశారు. మొదటి బహుమతి సాధించినవారికి రూ. 10 వేలు నగదు బహుమతి, రెండవ బహుమతి రూ. 8 వేలు, మూడవ బహుమతి రూ. 6 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మూడు విభాగాలలో ఉత్తమ క్రీడాకారులకు ఎం.రాజగోపాల్‌రావు పేరు మీద రూ. 3 వేల నగదు పురస్కారం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్‌జాదవ్, కార్యదర్శి సింగిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి ఎ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు




మినీ శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, జనవరి 21 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మిసౌగంధి ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై పలు ప్రదర్శనలు నిర్వహించారు. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

## కురుమ సంఘం స్మశానవాటిక అభివృద్ధి చేయాలని ఎంపిఆర్‌కు వినతి

**ఉప్పల్, జనవరి 21 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో కురుమ సంఘం స్మశానవాటిక అభివృద్ధికి నిధులు కేటాయించాలని పలువురు కురుమ సంఘం నేతలు గురువారం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కురుమ సంఘం నేతలు గొరిగె మల్లేష్, రేవు కృష్ణయ్య, గొరిగె పెద్ద మల్లేష్, చిందం వెంకటేష్, చౌదరపల్లి పర్వతాలు, గొరిగె ఐలయ్య, జన్ని రఘు, బట్కిరి బీరప్ప, కొల్లు ఐలయ్య, సోము జంగయ్య, కీర్తి శ్రీనివాస్, పెంటయ్య, జహంగీర్, మోటే నరసింహ తదితరులు పాల్గొని పలు సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ కురుమ సంఘం అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కురుమ సంఘం నేతలు పాల్గొన్నారు.

## గుర్తించిన ప్రదేశాలలోనే వ్యర్థాలు వేయాలి

**హైదరాబాద్, జనవరి 21 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి సూచించిన ప్రాంతాలలోనే వ్యర్థాలను వేయాలని నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ తెలిపారు. నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను యూజర్ ఛార్జీలు చెల్లించకుండా ఉండటానికి ప్రైవేట్ ట్రక్కుల వారు అక్రమంగా వివిధ ప్రదేశాలలో, రోడ్ ప్రక్కల డంపింగ్ చేస్తున్నారని, దీంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ఇలాంటి ఇబ్బందులను తొలగించటానికి జిహెచ్ ఏంసి కొన్ని ప్రదేశాలను గుర్తించడం జరిగినదని, ఆ ప్రదేశాలలోనే వ్యర్థాలను డంపింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆలా చేయని వారికీ జరిమానా విధించాలని జిహెచ్ఏంసి కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను యూజర్ ఛార్జీలు చెల్లించకుండా రోడ్ ప్రక్కల డంపింగ్ చేస్తున్న వారికి జరిమానాలు విధించాలని డిప్యూటీ కమీషనర్‌లను, సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందని తెలిపారు. ఎల్‌బినగర్ జోన్‌లో వ్యర్థాలను డంపింగ్ చేయాల్సిన ప్రాంతాలుగా కాప్రా సర్కిల్‌లోని సాకేత్ డంపింగ్ పాయింట్, ఉప్పల్ సర్కిల్‌లోని దేవేందర్‌నగర్ డంపింగ్ పాయింట్, హయత్‌నగర్‌లోని జిఎస్ఐ రోడ్ డంపింగ్ పాయింట్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. వ్యర్థాలు, కూల్చివేతకు సంబంధించిన మెటీరియల్ను జిహెచ్ఎంసి సూచించిన పాయింట్ల వద్ద మాత్రమే వేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## శరవేగంగా అభివృద్ధి పనులు : కొశికే ఐలయ్య



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కొశికె ఐలయ్య తదితరులు

**తుర్కయంజాల్, జనవరి 21 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి 22వవార్డులో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొశికే ఐలయ్య అన్నారు. శనివారం కమ్మగూడ రాజ్ రంజిత్ కాలనీ, నవభారత్ కాలనీ, ప్రగతినగర్, న్యూ ప్రగతినగర్ కాలనీల్లో రూ.33 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్లు, సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఐలయ్య శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి సహకారంతో తమ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నూతన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, సీసీ రోడ్లు ప్రాధాన్య క్రమంలో వేయిస్తున్నట్లు తెలిపారు. నాలుగన్నరేళ్లలో వార్డులోని అన్ని కాలనీలకు నిధులు కేటాయించి, పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ రంజిత్ కాలనీ ప్రెసిడెంట్ ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, యాదగిరిరెడ్డి, నవభారత్ కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణ రెడ్డి, మనోహర్, ప్రగతినగర్ వాసులు తిరుపతిరెడ్డి, మురళి, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరంలో ఉచితంగా మందుల పంపిణీ

**హైదరాబాద్, జనవరి 21 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ ప్రజయ్‌నివాస్ ఫేస్2 కాలనీలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. సందర్భంగా వైద్యులు కార్పొరేటర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించిన అనంతరం వృద్ధులకు కార్పొరేటర్ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజయ్‌నివాస్ ఫేస్2 కాలనీ ఎన్నికలలో గెలుపొందిన నూతన కమిటీ సభ్యులకు సర్టిఫికేట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికొరకు కృషి చేస్తామన్నారు. కాలనీలో ఏ సమస్య వచ్చినా వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని కాలనీవాసులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజయ్‌నివాస్ ఫేస్2 అధ్యక్షుడు శంకర్‌రావు, మాజీ అధ్యక్షుడు కొత్త తిరుమల్, వాసవి, విజయకుమార్, శరత్‌బాబు, మీన, నరసింహ, శ్రవణ్‌గౌడ్, లక్ష్మి నారాయణ, సురేష్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట్ కార్పొరేషన్ 16వ డివిజన్ జిల్లెలగూడ పాష్ కాలనీకి చెందిన సగర (ఉప్పరి) సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్, కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ డైరెక్టర్ మేకల యాదగిరి, బిఆర్ఎస్ నాయకులు చల్లా సురేందర్‌రెడ్డి, ఉప్పరి సంఘం నాయకులు పాల్గొన్నారు. (ప్రభాతవార్త, సరూర్‌నగర్)

## ఉప్పల్ సిఐగా ఎన్.ఎలక్షన్‌రెడ్డి బాధ్యతలు



రాచకొండ సిపి సుధీర్‌బాబును కలిసి సత్కరిస్తున్న ఉప్పల్ సిఐ ఎలక్షన్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 21 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్‌గా ఎన్. ఎలక్షన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాచకొండ సిపి సుధీర్‌బాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిఐ ఎలక్షన్‌రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నివారణకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులపై నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నేతలు, యువజన సంఘాల సభ్యులు సిఐ ఎలక్షన్‌రెడ్డిని కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సీతారాముల కల్యాణం



శ్రీ సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**సైదాబాద్, జనవరి 21 ప్రభాతవార్త :** అయోధ్యలోని రామ జన్మభూమిలో సోమవారం రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ట సందర్భంగా సైదాబాద్‌లోని ఏపీ కాలనీలోని ధర్మ నిలయంవద్ద ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణాన్ని లతామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. లతామా ఫౌండేషన్ చైర్మన్ కొంపెల్ల మాధవిలత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో పోరాటాల అనంతరం అయోధ్యలో భవ్య రామ మందిరం నిర్మాణం జరిగే రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ట జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, రాజు, పరమేష్, సుధాకర్, శివ, గౌడ్, కృష్ణ, మనోహర్, భరత్, చేతన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్రమోడీ ద్వారా శతాబ్దాల కల నెరవేరబోతోంది : పవన్‌కుమార్



ప్రదర్శనలో పాల్గొన్న కార్పొరేటర్ పవన్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 21 ప్రభాతవార్త:** అయోధ్యలో దివ్య భవ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ట సందర్భంగా కొత్తపేట డివిజన్ శివగంగాకాలనీలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పాల్గొని ప్రతిఒక్కరూ శ్రీరామచంద్రుడి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశ ప్రజల 500 సంవత్సరాల పోరాట ఫలితమే రామ మందిర ప్రాణ ప్రతిష్ట అని, ఎంతో మంది కరసేవకులు ఈ మందిరం నిర్మాణం కోసం ప్రాణాలు అర్పించడం జరిగిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా ప్రాణ ప్రతిష్ట జరగబోతుందని, ప్రతిఒక్కరూ సోమవారం సాయంత్రం ప్రతి ఇంట్లో ఐదుదీపాలను వెలిగించి అంగరంగ వైభవంగా ఒక పండగలాగా ఈ అయోధ్య ప్రారంభోత్సవాన్ని జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అంబాల మల్లేష్, కొర్లపల్లి స్వామి, వెంకటేష్‌గౌడ్, రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## జైపురికాలనీ నుంచి కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్‌వరకు పాదయాత్ర



శ్రీరాముడి ఫోటోతో ప్రదర్శనగా వస్తున్న ఉప్పల శ్రీనివాసగుప్త తదితరులు

**హైదరాబాద్, జనవరి 21 ప్రభాతవార్త:** అయోధ్యలో ఈనెల 22న శ్రీ బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరుగుతున్న సందర్భంగా నాగోల్ డివిజన్ జైపురికాలనీ హనుమాన్ వ్యాయామ శాల ఆధ్వర్యంలో జైపూర్‌కాలనీ సాయిబాబా దేవాలయంనుండి కర్మన్‌ఘాట్ హనుమాన్ గుడి వరకు పాదయాత్రగా బయలుదేరుతున్న సందర్భంగా ఐవిఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. హనుమాన్ వ్యాయామ శాల ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్ర ప్రారంభోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉప్పల శ్రీనివాస్‌గుప్త పాల్గొని శ్రీసీతారాముల చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ జి.లక్ష్మణ్‌గౌడ్, గిరి యాదవ్, గోపి, మాధవశర్మ, భాను తదితరులు ఉన్నారు.

## అంతట జై శ్రీరామ్ ..కాషాయమయం

**హైదరాబాద్, జనవరి 21 ప్రభాతవార్త :** అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా బస్తీలు కాలనీలో రహదారులు పూర్తిగా కాషాయమయమయ్యాయి. చైతన్యపురి, గడ్డిఅన్నారం, కొత్తపేట, నాగోల్, ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలు, ప్రధాన చౌరస్తాలు కాషాయ జెండాలు, శ్రీరాముడి చిత్రపటాలు, భారీ కటౌట్లు, బ్యానర్లతో నిండిపోయాయి. కాలనీలో బస్తీలలో గత రెండు వారాలుగా విహెచ్‌పి, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ శ్రీరాముడి అక్షంతలో ఐదు దీపాలను పంపిణీ చేశారు. అదేవిధంగా అన్ని దేవాలయాలు శుభ్రం చేసి కాషాయ జెండాలతో అలంకరింపజేశారు. సోమవారం నియోజకవర్గ పరిధిలో పెద్ద ఎత్తున ర్యాలీలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడానికి కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.



నాగోల్ చౌరస్తా వద్ద శ్రీరాముడి భారీ కటౌట్

## మీర్‌పేట్ కార్పొరేషన్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయండి : సబితా ఇంద్రారెడ్డి



నిర్మాణంలో ఉన్న కార్పొరేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 21 ప్రభాతవార్త:** జిల్లెలగూడ దీన్‌దయాళ్‌నగర్ ఆర్‌సిఐ రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ భవన పనులను రెండు నెలల్లో పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆమె మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, బిఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి తదితరులతో కలిసి నిర్మాణంలో ఉన్న కార్పొరేషన్ కొత్త భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు రూ. 2 కోట్ల నిధులతో ప్రజల సౌకర్యార్థం విశాలమైన కార్పొరేషన్ భవనాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. అయితే సంబంధిత పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సిద్దాల లావణ్య బీరప్ప, కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, నాయకులు దీప్‌లాల్ చౌహాన్, గడ్డమీది లక్ష్మణ్ ముదిరాజ్, అబ్బనమోని గోపియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్‌కు నేతల సన్మానం



ఇన్స్‌పెక్టర్‌ను సన్మానిస్తున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 21 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన ఇన్స్‌పెక్టర్ కాశీవిశ్వనాథ్‌ను బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడకు చెందిన పలువురు కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు సన్మానించి అభినందనలు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి, బోయపల్లి వెంకట్‌రెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, రామిడి కృష్ణారెడ్డి, రామిడి సుభాష్‌రెడ్డి, మల్గారి శ్రీధర్‌రెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, నవారు రాజిరెడ్డి, రామిడి వేణుగోపాల్‌రెడ్డిలతో పాటు పలువురు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

**మీర్‌పేట్ నాయకులు అభినందనలు...** మీర్‌పేట్ నూతన ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కాశీ విశ్వనాథ్‌ను మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన బిజెపి ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారిల ఆధ్వర్యంలో బిజెపి నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు శాలువాలతో సన్మానించి మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కీసర హరినాథ్‌రెడ్డి, భీమ్‌రాజ్, పార్టీ ప్రధాన కార్యదర్శి కోడూరు సోమేశ్వర్, నాయకులు బచ్చనమోని నర్సింహయాదవ్, శ్యామ్ సుందర్, వేణుగోపాల్ రెడ్డి,రంగారెడ్డి సత్తయ్య, దామోదర్‌రెడ్డి, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ నాయకులకు పిలుపు : ఎంపిఆర్



కాంగ్రెస్ నేతల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 21 ప్రభాతవార్త :** వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఉప్పల్ బీరప్పగడ్డలో జరిగిన చిలుకానగర్ డివిజన్ పార్టీ నేతల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో మరోసారి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. పార్టీ అధినేత ఎ.రేవంత్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపించిన ఘనత మల్కాజిగిరికి దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో రూ.పది కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఘుపతిరెడ్డి, ఆగంరెడ్డి, మహిళా నేత అమరేశ్వరి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి రామకృష్ణ, మండల అమర్, పల్లె రమేష్‌గౌడ్, మంచాల రఘు, ఎడ్ల అంజయ్య, గణేష్, సుశీల, శ్రీరాములు, జంగయ్య, శ్రవణ్, మొయినుద్దీన్, బొట్టు రాజేష్, రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**ఉప్పల్, జనవరి 21 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మధుసూధన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో ఆదివారం ఉదయం కానిస్టేబుల్ జి.రాజశేఖర్,హోంగార్డు రవీందర్‌లు పెట్రోలింగ్ డ్యూటి నిర్వహిస్తుండగా శ్యామల ఎంటర్ ప్రైజెస్ వద్ద గుర్తు తెలియని మగ వ్యక్తి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని 108 సిబ్బందితో చెక్ చేయించగా అతను చనిపోయి ఉన్నట్లు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందని, అతని ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని తెలిపారు. ముక్కు నుంచి రక్తం వచ్చిన ఆనవాలు ఉన్నాయని తెలిపారు. గుండె పోటు లేదా ఇతర కారణాలతో చనిపోయి ఉండవచ్చని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఉప్పల్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు సూచించారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం